క్లుప్తంగా

వీఓఏలకు శిక్షణ

ఆదోనిరూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో మంగళవారం ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ పాలసీపై వీఓఏలకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో పొదుపులు, సభ్యత్వం, వాటా ధనం, రుణ అభ్యర్థన, రుణ మంజూరు విధానం, రికార్డులు పొందుపరచడం, మైక్రో క్రెడిట్ ప్లాన్, రుణ పరపతి విధానం తదితర విషయాలపై శిక్షణ ఇచ్చినట్లు ఏపీఎం జనార్దన్ తెలిపారు. ఆయా గ్రామాల వీఓఏలు, ఎల్‌సీ నరసింహులు, సీసీలు రవి కుమార్, తిక్కన్న, నల్లన్న, రామన్న, సౌజన్య, నాగలక్ష్మి, అకౌంటెంట్ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



నిందితుల అరెస్టును చూపుతున్న సెబ్ సీఐ హరికృష్ణ

ఆదోనిరూరల్: కర్ణాటక మద్యం అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు సెబ్ సీఐ హరికృష్ణ తెలిపారు. ఆదోని పట్టణంలోని ఢణాపురం క్రాస్ రోడ్డు వద్ద ఆదోని పట్టణానికి చెందిన అమరావతి అంజి, బోయ వినోద్ మోటార్‌సైకిల్‌పై 15 బాక్సుల ఓసీ డీలక్స్ విస్కీ కర్ణాటక మద్యాన్ని రవాణా చేస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. మద్యంను స్వాధీనం చేసుకుని, బైకును సీజ్ చేసి, నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. దాడుల్లో సెబ్ ఎస్‌ఐలు మధుసూదన్‌రెడ్డి, పీసీలు శ్రీనివాస్, రోహిన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం అందించాలి

ఆదోనిసెంట్రల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు ఆర్‌ఐఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉపయోగపడే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా మధ్యాహ్న భోజనం అందించాలని కోరారు. సమయపాలన పాటించని ప్రిన్సిపాళ్లపై చర్యలు తీసుకోవాలన్నారు. కళాశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు గణేష్, నాగరాజు, గౌస్, దినేష్, రాజు, మహేష్ తదితరులు ఉన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ



విద్యార్థులకు ధ్రువ పత్రాలను అందిస్తున్న దృశ్యం

ఆదోనిఅర్బన్: విద్యార్థులు కరాటే నేర్చుకోవడం వల్ల అత్యవసర పరిస్థితుల్లో ఆత్మరక్షణ పొందవచ్చని, యోగా అభ్యసించడం ద్వారా విద్యలో సంపూర్ణమైన అభివృద్ధి సాధ్యమవుతుందని పారిశ్రామికవేత్తలు విట్టా సురేంద్రబాబు, శ్రీకాంత్‌రెడ్డి, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు బసవన్నగౌడ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం స్థానిక అశ్వర్థ లక్ష్మినారాయణ స్వామి ఆలయంలో మిర్యానీ చెన్నబసప్ప అధ్యక్షతన డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో వేసవి సెలవుల్లో యోగా, కరాటే శిక్షణ పొందిన 200 మంది విద్యార్థులకు ధ్రువ పత్రాలను అందించారు. వివేకానంద యూత్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు నాగరాజుగౌడ్, కరాటే మాస్టర్ కేశవ్, మలేకర్ శ్రీనివాసులు, ఈరన్నరావు, పంపాపతి, మణికంఠ, సంజీవ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా గ్యారతారీఖ్ వేడుకలు



సమాధి వద్ద ప్రార్థనలు చేస్తున్న ధర్మకర్త

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో మంగళవారం గ్యారతారీఖ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులు వివిధ ప్రాంతాల నుంచి వచ్చి అధిక సంఖ్యలో తరలివచ్చి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాల సమర్పించి ప్రార్థనలు చేశారు. దీంతో దర్గా పరిసర ప్రాంతాల్లో భక్తులతో సందడి నెలకొంది. అంతకుముందు తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ, పీఠాధిపతి ఖాదర్‌బాష చిష్టీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలు చేపట్టారు.

జయప్రదం చేయండి

పెద్దకడబూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా తలపెట్టిన బస్సు యాత్రను జయప్రదం చేయాలంటూ సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్‌యాదవ్, మండల కార్యదర్శి వీరేష్, రైతు సంఘం తాలుకా కార్యదర్శి ఆంజనేయ పిలుపునిచ్చారు. పెద్దకడబూరులోని స్థానిక బస్టాండ్ ఆవరణలో మంగళవారం బస్సు యాత్రను జయప్రదం చేయాలంటూ గోడ పత్రికలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ.. రైతులు, ప్రజలు బస్సు యాత్రలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సీపీఐ నాయకులు తిక్కన్న, చంద్ర, యాసిన్, శంకర్, నాగేష్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

మండిగిరిలో అభివృద్ధి పరుగులు

- 75 శాతం పనులు పూర్తి
- వేగవంతంగా మిగిలిన 25 శాతం పనులు
- నాలుగేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఘనత
- హర్షం వ్యక్తం చేస్తున్న మండిగిరివాసులు



మండిగిరి పంచాయతీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు

ఆదోనిరూరల్: గత టీడీపీ హయాంలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. గ్రామాలు, పట్టణాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండిపోయాయి. దీంతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వం మారిన తర్వాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అభివృద్ధికి బీజం పడింది. వాడవాడలా అభివృద్ధి వైఎస్సార్‌సీపీ హయాంలోనే సాధ్యపడింది. ప్రతి గ్రామ పంచాయతీని ప్రభుత్వం ఆదర్శంగా తీర్చిదిద్దుతోంది.

ఆదోని మండలంలో పట్టణానికి ఆనుకున్న ఉన్న మేజర్ గ్రామ పంచాయతీ మండిగిరిలో నాలుగేళ్లలో 75 శాతం అభివృద్ధి పనులు పూర్తి చేయగా, మరో 25 శాతం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, నిరంతరం గ్రామాల్లో కలియతిరిగి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు ఎంపీడీఓ గీతావాణి దృష్టికి తీసుకెళ్లి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

అభివృద్ధి పనుల వివరాలు ఇలా..

- మండిగిరిలో రూ.3.60 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం
- బాబాగార్డెన్ ప్రాంతంలో రూ.28 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలు
- తిరుమలనగర్‌లో రూ.60 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం చేపట్టగా పనులు పూర్తయ్యాయి.
- కట్టి ఆంజనేయస్వామి కాలనీ (అమరావతి స్కూల్) ప్రాంతంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, పైపులైన్లు రూ.56 లక్షలతో పూర్తి చేశారు.
- టీచర్స్ కాలనీ, విద్యానగర్ కాలనీలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు రూ.18 లక్షలతో పూర్తి
- శంకరమఠం ప్రాంతంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు రూ.22 లక్షలతో పూర్తి
- రాయచోటి సుబ్బయ్య కాలనీ, శాంతి ఎస్టేట్, శ్రీదేవి ఎస్టేట్, బుడగజంగాల కాలనీ, బీసీ కాలనీ, మునిరత్నం ఎస్టేట్ ప్రాంతాల్లో రూ.90 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించారు.
- భరత్‌నగర్‌లో రూ.32 లక్షలతో డ్రెయినేజీ కాలువలను ఏర్పాటు చేశారు.

నాణ్యతగా పనులు చేపడుతున్నాం



మండిగిరి గ్రామ పంచాయతీ నిధులతో నాలుగేళ్లలో రూ.3.60 కోట్లతో నాణ్యతగా పనులు చేస్తున్నాం. అందుకు ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఆయన తనయుడు మనోజ్‌కుమార్ రెడ్డి పూర్తి సహకారం అందించడంతో పనులు వేగవంతంగా పూర్తయ్యాయి. నాణ్యతలో రాజీ లేకుండా పనులు చేపడుతున్నాం. – గీతావాణి, ఎంపీడీఓ

మిగలిన పనులు త్వరలో పూర్తి చేస్తాం



మండిగిరి అభివృద్ధిని గత టీడీపీ ప్రభుత్వం విస్మరించింది. వైఎస్సార్‌సీపీ పాలనలో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలు వేగవంతం చేసేలా గ్రామ పంచాయతీ నిధులు వెచ్చించారు. ఇప్పటికే 75 శాతం పనులు పూర్తి అయ్యాయి. మరో 25 శాతం పనులు చేయాల్సి ఉంది. ఎమ్మెల్యే కృషితో ఈ యేడాది లోపు పనులన్నీ పూర్తి చేసేలా కృషి చేస్తున్నాం. – శేషిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి

కేసు నమోదు

ఆదోనిఅర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం, పోలీసులకు విధులను అడ్డుకుని ఇబ్బందులు కలిగించడం, అనుమతి లేకుండా ర్యాలీ చేయడంపై మైనార్టీ నాయకుడు సలీంపై ఇన్‌స్పెక్టర్ ఎస్‌ఐ శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ శివనారాయణ స్వామి మంగళవారం తెలిపారు. అజీరా అనే బాలిక అత్యాచారం ఘటనపై సోమవారం సలీం ఇంటి నుంచి ర్యాలీ చేపట్టి పైచర్యలకు పాల్పడడంతో కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

రూ.17 వేలు సైబర్ మోసం

ఆదోనిఅర్బన్: పట్టణంలోని క్రాంతినగర్‌కు చెందిన రామాంజనేయులుకు ఓ ఆగంతకుడు ఫోన్ కాల్ చేసి మాయ మాటలు చెప్పి రూ.17 వేలు కాజేశాడు. బాధితుడు రామాంజనేయులు తెలిపిన వివరాలు.. తనకు ఓ వ్యక్తి ఫోన్ చేసి ఆరోగ్యశ్రీ కింద రూ.28 వేలు మంజూరయ్యాయి, ఫోన్ పే నంబర్ ఇస్తే ఖాతాలో జమ చేస్తామని చెప్పారన్నారు. తనకు ఫోన్‌పే లేకపోవడంతో స్నేహితుడు రవికి చెందిన ఫోన్ పే నంబర్ ఇచ్చారు. ఆగంతకుడు చెప్పినట్లుగా ఫోన్ పే ఓపెన్ చేసి ఓటీపీలు చెప్పడంతో రవి ఖాతాలో రూ.17 వేలు మాయమయ్యాయని రామాంజనేయులు ఆవేదన వ్యక్తం చేశాడు. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు వెల్లడించారు.

బీమా తక్షణ సాయం అందజేత

పెద్దకడబూరు: చిన్నతుంబళం గ్రామానికి చెందిన కురువ లక్ష్మన్న అనారోగ్యంతో మృతి చెందడంతో వెల్ఫేర్ అసిస్టెంట్ పుణ్యావతి, వైస్ ఎంపీపీ ముత్తమ్మతో కలసి మృతుడి భార్య ఉసేనమ్మకు మంగళవారం వైఎస్సార్ బీమా తక్షణ ఆర్థిక సాయం రూ.10 వేలు అందజేశారు. మిగతా మొత్తం త్వరలోనే నామినీ బ్యాంకు ఖాతాలో జమ అవుతుందన్నారు.

ముమ్మరంగా పూడికతీత పనులు



పూడికతీత పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి

ఆదోనిటౌన్: పట్టణంలోని 28వ వార్డు కంచిగారి వీధిలో పూడికతీత పనులను మంగళవారం చేపట్టారు. పనులను మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, శానిటరీ సెక్షన్ అధికారులు, కౌన్సిలర్ బాలాజీ పరిశీలించారు. చెత్తాచెదారం, పూడిక, కొబ్బరి బోండాలు, ప్లాస్టిక్ కవర్లతో నిండిపోయిన కాలువలను శుభ్రం చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. చిన్నపాటి వర్షం కురిసినా బురద నీరు కాలువలో నిండి రోడ్లపై ప్రవహించే అవకాశం ఉండడంతో ఎప్పటికప్పుడు కాలువలను శుభ్రం చేయిస్తున్నామన్నారు. ప్రజలు పట్టణ పరిశుభ్రతకు సహకరించాలని కోరారు.

పైర్లను కాపాడుకోవాలి



మిరప పైరును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

పెద్దకడబూరు: రైతులు వ్యవసాయ అధికారులు చెప్పిన సూచనలు, జాగ్రత్తలు పాటించి పంటలను చీడపీడల బారి నుంచి కాపాడుకోవచ్చునని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.రమేష్‌నాయక్, మండల వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్ పేర్కొన్నారు. మండల పరిధిలోని నౌలేకల్లు, బసలదొడ్డి గ్రామాలలో పత్తి, మిరప, ఉల్లి తదితర పంటలను మంగళవారం వారు పరిశీలించి పైర్లను ఆశించే చీడపీడల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ.. మిరపలో పైముడత, ఎండు తెగులు, వేరుపురుగు, జెమిని వైరస్ ఉధృతిని గమనించినట్లు తెలిపారు. పత్తి పంటలో పూత, పిందెలు రాలడం, గులాబి రంగు పురుగును గుర్తించి వాటి నివారణకు తగిన సూచనలు చేశారు. మిరపలో పైముడత, కింద ముడత నివారణకు ఎకరానికి 160 మి.లీ, స్పైరోమేసిన్ లేదా 400 మి.లీ క్లోరొఫెనాపైర్ పిచికారీ చేయాలన్నారు. ఎండు తెగులు నివారణకు ఎకరానికి 4 కిలోల చొప్పున ట్రైకోడెర్మా, సూడోనస్ 100 కిలోలు పశువుల ఎరువుతో కలిపి చల్లుకోవాలన్నారు. ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

మీరు మారరా?



క్షురకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అసిస్టెంట్ కమిషనర్ వాణి

కౌతాళం: మీరు ఇక మారరా? అంటూ మంగళవారం ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి క్షురకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం సాక్షి దినపత్రికలో 'దోపిడీకి హద్దేదీ' శీర్షికతో ఉరుకుంద ఆలయంలో స్వామివారికి తలనీలాలు సమర్పించుకోవాలంటే రూ.25 టిక్కెటుతో పాటు తలకు రూ.100 చొప్పున అదనంగా ఇవ్వాల్సిందే అంటూ వచ్చిన వార్తకు కమిషన్ స్పందించారు. క్షురకులను పిలిపించి హెచ్చరికలు జారీ చేశారు. ఇలా అయితే ఇక నుంచి పనిలోకి రావొద్దంటూ మండిపడ్డారు. ఇదే చివరి అవకాశం అని భక్తుల నుంచి ఫిర్యాదులు అందితే పనిలోంచి తొలగించి కొత్తవారిని ఎంపిక చేస్తామన్నారు. టెంకాయల వ్యాపారస్తులు కూడా దేవాలయం కమిటీ నిర్ణయించిన ధరకే టెంకాయలను అమ్మాలని అధిక ధరకు విక్రయిస్తే వ్యాపారం రద్దు చేయిస్తానని హెచ్చరించారు.

కోసిగి పాఠశాలకు ప్రతిభ అవార్డు



అవార్డు అందుకుంటున్న హెచ్‌ఎం ఖలీల్‌అహ్మద్

కోసిగి: మండల కేంద్రమైన కోసిగి బాయ్స్ హైస్కూల్‌కు క్రీడా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతిభ అవార్డు దక్కింది. ఈ పాఠశాలకు మూడవ స్థానం రావడంతో ప్రతిభ అవార్డు కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం ఖలీల్‌అహ్మద్‌ను జిల్లా విద్యా శాఖ అధికారులు సత్కరించారు. ఈ అవార్డు వల్ల తమ పాఠశాల ప్రతిభ అన్ని చోట్ల వ్యాపించిందని, విద్యార్థులు మరింతగా కృషి చేసి మరిన్నో అవార్డులు తీసుకుని రావాలని హెచ్‌ఎం కోరారు.

ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి



ధ్యాన్‌చంద్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయశాంత, డీఎస్పీ శివనారాయణస్వామి

ఆదోనిఅర్బన్: పద్మభూషణ్ అవార్డు గ్రహీత, హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్‌ను విద్యార్థులు, క్రీడాకారులు స్ఫూర్తిగా తీసుకోవాలని ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, డీఎస్పీ శివనారాయణ స్వామి, వైఎస్సార్‌సీపీ యువనాయకుడు మనోజ్‌కుమార్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు విట్టా రమేష్ సూచించారు. మంగళవారం స్థానిక మున్సిపల్ క్రీడా మైదానంలో ఏపీపీఈటీ అండ్ పీడీ అసోసియేషన్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో మేజర్ ధ్యాన్‌చంద్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ ధ్యాన్‌చంద్ ఉత్తరప్రదేశ్‌లోని అణగారిన కుటుంబంలో జన్మించి హాకీలో దేశానికి కీర్తిప్రతిష్టలు తీసుకొచ్చారన్నారు. నాలుగుసార్లు ఒలింపిక్ క్రీడల్లో దేశానికి పతకాలను సాధించి పెట్టారని, ఓటమి ఎరగని క్రీడాకారుడిగా పేరు సంపాదించాడన్నారు. తమ దేశం తరఫున ఆడాలని హిట్లర్ ఆదేశించినా లెక్కచేయకుండా మాతృదేశంపై గౌరవంతో భారతదేశం తరఫున ఆడి వరుస విజయాలు సాధించాడని చెప్పారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నరసింహరాజు, నరసింహులు, నాయకులు ఆనంద్, వెంకటేష్, షాబీర్, ముజాహిద్దీన్, రామన్న పాల్గొన్నారు.

తియ్యనైనది తెలుగు భాష



తెలుగు భాషకు అక్షర రూపంలో శుభాకాంక్షలు తెలుపుతున్న విద్యార్థులు



ఆదోనిలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహిస్తున్న హెచ్‌ఎం అలీంసిద్ధిఖీ, ఉపాధ్యాయులు



తెలుగు ఉపాధ్యాయులను సన్మానిస్తున్న హెచ్‌ఎం వెంకటేశులు, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది



కంబదహాల్‌లో గిడుగు వెంకటరామ్మూర్తి చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆదోనిసెంట్రల్: మానసిక వికాసానికి మాతృ భాష ఎంతో తోడ్పడుతుందని నెహ్రూ స్మారక పురపాలక ఉన్నత పాఠశాల హెచ్‌ఎం హలీం సిద్ధిఖీ అన్నారు. మంగళవారం గిడుగు రామ్మూర్తి జయంతి తెలుగు భాష దినోత్సవం సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించారు. వ్యాసరచన, శతక పద్యాల పోటీ, గేయాల పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు పుస్తకాలను బహుమతులుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్ని భాషలు నేర్చినా సొంత భాషను మరువకూడదన్నారు. అలాగే జాతీయ క్రీడా దినోత్సవాన్ని పీడీ శ్వేతాభాయి ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆదోనిరూరల్: మండలంలోని పెద్దతుంబళం జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం వెంకటేశులు, తెలుగు ఉపాధ్యాయులు సక్కిరి భాస్కర్ మాట్లాడుతూ తెలుగు భాషా విశిష్టత, చమత్కారం, పాట ఏక పాత్రాభినయం గురించి తెలియజేశారు. కాఫీ దండకం, కోడి పాటలతో విద్యార్థులను అలరించారు. తెలుగు భాషపై నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

పెద్దకడబూరు: మండల పరిధిలోని కంబదహాల్ గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవంను బాలబంధు, గణితోపాధ్యాయుడు గద్వాల సోమన్న, తెలుగు భాషోపాధ్యాయుడు కేశవయ్య ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ముందుగా ఉపాధ్యాయులు, విద్యార్థులు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వాడుక భాష తెలుగుకు గిడుగు చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కౌతాళం: తెలుగు భాష ఔన్నత్యాన్ని కాపాడుకోవడానికి ప్రతి విద్యార్థి ముందుకు రావాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని కళాశాలలో, జెడ్పీ పాఠశాలలో తెలుగు భాష దినోత్సవాన్ని పురస్కరించుకుని గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలవేసి నివాళులు అర్పించారు. అలాగే క్రీడా దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

కానుకల లెక్కింపు సేవ



రాయచూర్‌కు చెందిన బృందం

కౌతాళం: ఆంధ్ర, కర్ణాటక ప్రాంతంలో ఎక్కడ దేవాలయాల్లో హుండీ లెక్కింపు కార్యక్రమం జరిగినా అందులో పాల్గొని మన్ననలు పొందుతున్నారు విజయవాడకు చెందిన దుర్గా శివసాయి సేవ మండలి సభ్యులు. ఆహ్వానం అందితే చాలు సొంత ఖర్చులతో ఆయా ఆలయాలకు చేరుకుని ఉచితంగా సేవలు అందించి వెళుతున్నారు. మంగళవారం ఉరుకుంద ఈరన్నస్వామి దేవాలయంలో హుండీ కానుకల లెక్కింపు జరిగింది. ఈ లెక్కింపులో రాయచూర్ నుంచి 30 మంది సేవా బృందం వచ్చి పాల్గొన్నారు. వారిని 'సాక్షి' పలకరించగా పలు విషయాలను పంచుకున్నారు. సేవా సమితిలో దాదాపు 600 మంది సభ్యులు ఉన్నారని, ఈ సేవ తమకు తృప్తి నిస్తోందని బృందం పెద్ద లక్ష్మణ్ తెలిపారు. ఆలయ నిర్వాహకులు ఇచ్చే స్వామివారి ప్రసాదం మాత్రమే తీసుకుంటామని చెప్పారు. గత ఐదేళ్ల నుంచి ఈ సేవలో పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు.

ఈ సేవతో ఆరోగ్యం బాగుంది

గత ఐదేళ్లుగా ఎక్కడి ఆలయంలోనైనా కానుకల లెక్కింపు చేపట్టేందుకు ఆహ్వానం అందితే సభ్యులను వెంటపెట్టుకుని సొంతంగా చార్జీలు పెట్టుకుని వెళుతున్నాం. దేవాలయం వారి నుంచి ఎలాంటి సొమ్మును ఆశించం. ఈ సేవ వల్ల నాకు ఆరోగ్యం బాగుంది. దేవుడి సేవ చేయడంలో చాలా సంతోషం ఉంది. – లక్ష్మణ్

స్వామిసేవలో తరించడం ఎంతో పుణ్యం

ఎక్కడి నుంచో వచ్చి స్వామి సేవ చేయడం పుణ్యంగా భావిస్తున్నా. గత ఐదేళ్ల నుంచి రెండు రాష్ట్రాల్లోని అన్ని దేవాలయాల్లో సేవలు అందించాన. ఇలాంటి సేవ ఎక్కడ దొరకదు. – మురళీధర్

ఈరన్న స్వామి వద్ద అంతా శుభమే

ఈరన్న స్వామి వద్ద సేవలు అందించడం సంతోషంగా ఉంది. మా సభ్యులు కొంతమంది ఉరుకుంద ఈరన్న స్వామి వద్దకు రారు. మేము కొంత మంది మాత్రం ప్రారంభం నుంచి వస్తున్నాం. అంతా శుభమే జరుగుతుంది. –లక్ష్మిదేవి

స్వామిని దర్శించుకునే భాగ్యం

ఈరన్న స్వామిని దర్శించుకునే భాగ్యం కలుగుతుంది అలాగే హుండీ కానుకల లెక్కింపు సేవ ఉచితంగా చేపట్టి స్వామి ఆశీస్సులు తీసుకోవడం సంతోషంగా ఉంటుంది. ఇలాంటి సేవ దొరకడం అదృష్టంగా భావిస్తున్నాను. –వీరయ్య

డీఎస్‌ఎఫ్ నూతన కమిటీ ఏర్పాటు

ఆదోనిసెంట్రల్: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో డీఎస్‌ఎఫ్ ముఖ్య నాయకుల సమావేశాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్‌ఎఫ్ జిల్లా నాయకులు రాజు మాట్లాడుతూ.. ఆదోనిలో ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీ విచ్చలవిడిగా జరుగుతుందన్నారు. అయినా విద్యాశాఖ అధికారులు కన్నెత్తి కూడా చూడడం లేదని ఆరోపించారు. సంబంధిత అధికారులు విచారణ చేపట్టి ఫీజుల దోపిడీపై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆదోని డివిజన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా ఇస్మాయిల్, సురేష్, డివిజన్ కోశాధికారులుగా వంశీ, సురేష్, లోకేష్, ఈరన్న, డివిజన్ నాయకులుగా అజయ్, రాజేష్, గిడ్డయ్య, మహేష్, చక్రీధర్, వినేష్, రఘు, సంతోష్, రాము, నవీన్, జోసెఫ్‌లతో పాటు మరో 60 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఇంకుడు గుంతకు రూ.6 వేలు

మద్దికెర: జగనన్న కాలనీల్లో ఇల్లు నిర్మించుకున్న వారు ఇంకుడు గుంత తవ్వుకుంటే అదనంగా రూ.6 వేలు మంజూరు చేస్తామని హౌసింగ్ ఏఈ ఉమాకాంత్ మంగళవారం తెలిపారు. ప్రభుత్వం అందించే రూ.1.80 లక్షలతో పాటు మరో రూ.6 వేలు అందించనున్నట్లు తెలిపారు. ఇళ్లు నిర్మించుకుంటున్న వారు బాత్‌రూంకు సంబంధించి నీరు రోడ్లపై ప్రవహించకుండా ఇంకుడు గుంతలు తవ్వుకోవాలని సూచించారు.

ప్రారంభమైన దశమి ఉత్సవాలు



పూజలందుకుంటున్న చింతలముని స్వామి

ఆదోనిరూరల్: మండలంలోని దొడ్డనగేరిలో వెలసిన చింతలముని స్వాముల వారి 45వ ఆరాధన దశమి మహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మంగళ, బుధ, గురువారాల్లో మూడు రోజులపాటు దశమి ఉత్సవాలు అంగరంగ వైభవంగా గ్రామస్తులు నిర్వహించుకోనున్నారు. ఉదయం నుంచి స్వామివారికి పాలాభిషేకం, జలాభిషేకం, కుంకుమార్చన తదితర విశేష పూజలు నిర్వహించారు. బుధవారం ఉచ్చాయ కార్యక్రమం, రాత్రి భజన కార్యక్రమాలు ఉంటాయని గ్రామస్తులు తెలిపారు. గురువారం నాడు చింతలామునిస్వామి రథోత్సవం, పడమర గాలిగోపుర కలశ ప్రతిష్టాపన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.